సాక్షి
మెదక్

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



బాబోయ్ దొంగలు

బంగారం ధరలు పెరగడంతో చైన్ స్నాచర్ల దాడులు సైతం అంతకంతకు పెరుగుతున్నాయి. వివరాలు IIలో ▸



కష్టే ఫలి!

ఏదో చేస్తారని ఎదురు చూసే ఈ రోజుల్లో ఓ వృద్ధుడు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాలు IIలో ▸



అవినీతి అధికారులపై వేటు

సంగారెడ్డి ప్రాంతంలో తొమ్మిదేళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఓ ఇంజనీరింగ్ ఉన్నతాధికారి చెరువుల కబ్జాదారులతో చేతులు కలిపారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

అప్పులు తీర్చేందుకే రెండేళ్లు

మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు



మందులు పంపిణీ చేస్తున్న హనుమంతరావు

నిజాంపేట(మెదక్): గత ప్రభుత్వంలో చేసిన అప్పులు తీర్చడంతోనే రెండేళ్ల పాలన సరిపోయిందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో లీలా గ్రూప్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు డా.మోహన్ నాయక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని, మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. వచ్చే మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం మహిళలు గ్రామానికి బస్సులు నడపాలని విజ్ఞప్తి చేయడంతో డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, మహేందర్, సత్యనారాయణ, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

కమలను హత్య చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న జాగృతి నేత మాధవి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం సంగాయిగూడతండాకు చెందిన కమలను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్‌రూరల్ సీఐ జార్జ్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కమల నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహిళలపై జరుగుతున్న హత్యలపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్ర మహిళా మంత్రి కొండా సురేఖ, సీతక్క ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆమె వెంట జాగృతి జిల్లా నాయకుడు వీరప్ప గారి రమేశ్‌గౌడ్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

బాధితులందరికీ న్యాయం చేయాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్ కుమార్



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): 317 జీఓ కారణంగా స్థానిక జిల్లాను కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ శాశ్వతంగా వారి సొంత జిల్లాలకు కేటాయించేలా చూడాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీపీటీఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిజాంపేట మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బైతి ఐలయ్య మాట్లాడుతూ.. తాత్కాలిక డిప్యుటేషన్ కోసం ఇచ్చిన జీఓ 190 సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం చేసే లా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ రత్నాకర్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, జిల్లా బాధ్యులు మోహన్, పరమేశ్వర్, శ్రీకాంత్ రెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

హక్కులు సంపూర్ణంగా పొందాలి



మాట్లాడుతున్న హేమభార్గవి

నర్సాపూర్: రాజ్యాంగం ద్వారా సంక్రమించే హక్కులను బాలికలు సంపూర్ణంగా పొందాలని ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ హేమ భార్గవి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలో బాలికల రక్షణ కోసం రాజ్యాంగంలో పలు చట్టాలు ఉన్నాయని, ఆయా చట్టాలను బాలికలు తమ రక్షణకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోకిరిల నుంచి రక్షణ పొందడానికి 100 కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, కోర్టు ఏజీపీ సుధాకర్, ఎంఈఓ తారాసింగ్, లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదులు మధుశ్రీ, రాజునాయక్, సాయికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంతోష, జెండర్ కోఆర్డినేటర్ కవిత పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్జాగా దగా

సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను సైతం ఖాతరు చేయడంలేదు. ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ మిల్లర్లు మొండికేస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మరాడించి సివిల్‌సప్‌లైకి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బియ్యాన్ని కాజేస్తున్నారు. తొమ్మిదేళ్లుగా 13 మంది మిల్లర్ల యాజమాన్యాలు 61వేలకుపైగా మెట్రిక్‌టన్నుల బియ్యం ఎగ్గొట్టారు. వీటి విలువ రూ. 214 కోట్లు. రికవరీ కోసం ఆర్ఆర్ యాక్టు ప్రయోగించినా వసూళ్లు కాకపోవడం గమనార్హం. – మెదక్‌జోన్

- తొమ్మిదేళ్లుగా సీఎంఆర్ బియ్యం ఎగవేత
- రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం
- 61,786 మెట్రిక్ టన్నుల రైస్ బకాయి
- పెనాల్టీతో వీటివిలువ రూ.214 కోట్లు
- క్రిమినల్ కేసులు నమోదు



మెదక్ జిల్లాలో గత తొమ్మిదేళ్ల(వానాకాలం, రబీ)గా 13 రైస్ మిల్లర్లు 61,786.193 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్‌సప్‌లైయ్‌కి బకాయి పడ్డారు. వీటికి సంబంధించి జరిమానా, వడ్డీ కలిపి మొత్తం రూ.214.15 కోట్లు ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీటి రికవరీ కోసం ఆర్ఆర్ యాక్టు ప్రయోగించినా పెద్దగా ఫలితం లేదని తెలిపారు.

రికవరీ చేయకుండానే కేటాయింపులు

బకాయి పడిన మిల్లర్ల నుంచి పూర్తిగా బియ్యం రికవరీ చేశాకే మళ్లీ ధాన్యం కేటాయించాల్సి ఉంది. కానీ అవేం నిబంధనలు పట్టించుకోకుండా తొమ్మిదేళ్ల పాటు వానాకాలం, రబీ సీజన్‌లలో 18 సార్లు బకాయిపడిన మిల్లులకు ధాన్యం కేటాయించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అప్పట్లో ఉన్న నేతల ఒత్తిడి ఏమైనా ఉందా? లేకా మరేకారణాలు ఉన్నాయో తెలియదుకానీ వందల కోట్ల విలువైన బియ్యాన్ని 13 మంది మిల్లర్లు బొక్కడం గమనార్హం.

ఒకే మిల్లు వద్ద రూ.4 కోట్ల బియ్యం బకాయి

పాపన్నపేటకు చెందిన ఒక రైస్ మిల్లు.. 2012 నుంచి 2016 వరకు వానాకాలం, యాసంగిలో 70.128 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్‌సప్‌లైయ్‌కి బకాయి పడింది. ఇందుకు సంబంధించి జరిమానా, వడ్డీ కలిపి ఆ బియ్యం విలువ రూ.4 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. సదరు మిల్లర్ యజమాని ఆ బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో దర్జాగా విక్రయించి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఆర్‌యాక్టు ప్రయోగం

తొమ్మిదేళ్లుగా 61,786 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి పడిన 13 మంది మిల్లర్లకు నోటీసులు ఇచ్చాం. అయినా స్పందించక పోవటంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. ఆర్ఆర్‌యాక్టు ప్రయోగించాం. రికవరీకి చర్యలు చేపడుతున్నాం.

– జగదీశ్‌కుమార్, డీఎం సివిల్‌సప్లై

కొనుగోలు కోలాహలం

- 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- 426 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- 7 వేల టార్పాలిన్లు.. 50 లక్షల గన్నీ బ్యాగులు
- అందుబాటులో గోదాంలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసారి 423 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉండగా, కొనుగోలు కేంద్రాలకు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

–మెదక్ అర్బన్

మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి కురిసిన వర్షాలు.. పోటెత్తిన వరదల్లో పంటలు మునిగి తేలాయి. దిన దిన గండంగా ఎవుసం చేసిన అన్నదాత ఎట్టకేలకు గట్టెక్కాడు. కొన్ని చోట్ల ఇంకా పంటలు చేతికి రాలేదు. జిల్లాలో సుమారు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. ఇందులో 3.30 లక్షల మెట్రిక్ టన్నులు రైస్ మిల్లుల్లో దించుకుంటామని, మరో 60 వేల మెట్రిక్ టన్నులు సమీప జిల్లాలకు పంపించే అవకాశం ఉందని డీఎం జగదీశ్వర్ తెలిపారు. కాగా గత ఖరీఫ్‌కు సంబంధించి 90 శాతం, యాసంగికి సంబంధించి 50 శాతం సీఎంఆర్ పూర్తి చేశారు. ప్రస్తుతం మొత్తం 493 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ 176, పీఏసీఎస్ 317 కేంద్రాలు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాయి. కాగా ఈసారి 38 పారా, 47 రా రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించనున్నారు. ఎంపిక చేసిన మిల్లులు బ్యాంక్ గ్యారంటీ విధిగా ఇవ్వాల్సి ఉంటుంది.

కోతలు ప్రారంభం

కొల్చారం, రామాయంపేట, పాపన్నపేట మండలాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. కాగా కొల్చారం మండలంలోని వరిగొంతం, అప్పాజిపల్లి, అంసాన్‌పల్లి, పోతంశెట్టిపల్లి, కొంగోడ్, నాయిని జలాల్‌పూర్ , వెంకటాపూర్, కొల్చారం గ్రామాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. పాపన్నపేట మండలంలోని చీకోడ్, లింగాయపల్లి, లక్ష్మీనగర్‌లో వరి కోతలు కోస్తున్నారు. రామాయంపేట మండలంలోని కోనాపూర్, వెంకటాపూర్, ప్రగతి ధర్మారం, నిజాంపేట మండలం నస్కల్, నందిగామ, కల్వకుంట తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనా... ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు.



కొల్చారం మండలం కొంగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

ముందస్తు ప్రణాళిక ఏదీ..?

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం
- కనీస సౌకర్యాలు కూడా లేవని మండిపాటు

కొల్చారం(నర్సాపూర్): ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొంగోడ్, నాయని జలాల్పూర్, అంసాన్ పల్లి, కొల్చారం, వెంకటాపూర్, పోతంశెట్టిపల్లి, వరిగుంతం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముందస్తుగా కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటికీ అవసరమైన గన్నీ బ్యాగులు, హమాలీలను, ట్రాన్స్‌పోర్టు సౌకర్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేంద్రాల ఏర్పాటులో ఉన్న ఉత్సాహం.. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించడంలో కానరావడం లేదన్నారు. మేలు రకం వరి వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 చెల్లిస్తున్నారని, ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరను పొందాలని కోరారు. ఇస్తామన్న బోనస్ డబ్బులను కూడా సకాలంలో ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్వేతాకుమారి, ఆర్ఐ ప్రభాకర్ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

భర్త పోయిన పుట్టెడు దుఃఖంలో ఉన్న మాగంటి సునీతపై మంత్రి పొన్నం ప్రభాకర్ హేళన చేస్తూ మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. మంత్రులకు మహిళలంటే ఇంత చిన్నచూపా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి అసహనానికి ఎందుకు గురవుతున్నారో తెలియడం లేదన్నారు. మానవతా విలువలను తగ్గించే విధంగా సాటి మహిళ బాధతో ఏడిస్తే కూడా దాన్ని రాజకీయం చేయడం ఖండించదగ్గ విషయమని పేర్కొన్నారు. పొన్నం వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. కోటి గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, ప్రస్తుతం 50 లక్షలు నిల్వ ఉన్నాయి. మిగతావి త్వరలో వస్తాయి. 13 వేల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. మరో 7 వేలు అవసరం అవుతాయి. అవసరమైనన్నీ మాయిశ్చర్ మీటర్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు అందుబాటులో ఉన్నాయి. ఈసారి కొత్తగా 100 ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్‌లను ఉపయోగిస్తాం.



– జగదీశ్ కుమార్, డీఎం, సివిల్ సప్లయిస్



కోనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

498 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- అవినీతికి పాల్పడితే కేసులే..

రామాయంపేట(మెదక్): ధాన్యం కొనుగోలులో అవినీతికి పాల్పడితే కేసులు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. మండలంలోని కోనాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో 498 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందులో 430 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. పది కేంద్రాలకు రైతులు ధాన్యం తరలించారని, దీపావళి అనంతరం కేంద్రాలకు అధిక మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉందని, తూకం యంత్రాలతోపాటు తేమ శాతాన్ని కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సజీలుద్దీన్ తదితరులున్నారు.

విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దు

మెదక్ కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను బకాయిల కోసం గది బయటకు పంపితే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దని చెప్పారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని, తల్లిదండ్రులను ఫీజు కట్టమని అడగటం లేదా విద్యార్థులను బయటకు పంపడం వంటి వాటికి పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కంట్రోల్‌రూంను కలెక్టర్ ప్రారంభించారు.

రూ.8 కోట్లతో పర్యాటక సొబగులు

- దంతేపల్లి శివారులో 80 ఎకరాలలో ఏర్పాటు
- జిల్లా అటవీ అధికారి జోజి
- పర్యాటక ప్రదేశం సందర్శన



పర్యాటక ప్రాంతం ఏర్పాటుకు సంబంధించిన మ్యాప్

రామాయంపేట(మెదక్): రామాయంపేట అటవీశాఖ రేంజ్ పరిధిలో పర్యాటక ప్రాంతం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం మండలంలోని దంతేపల్లి శివారులో 80 ఎకరాల అటవీప్రాంతాన్ని గుర్తించారు. రూ.8 కోట్ల వ్యయంతో ఇది ఏర్పాటు కానుంది. పర్యాటకులు రాత్రివేళ బస చేయడానికి వీలుగా గుడారాలు, గుట్టల చుట్టూ రహదారి సదుపాయం, లోపలిభాగంలో తిరుగడానికి వీలుగా సఫారి వాహనం, ఇతర వసతులు సమకూరనున్నాయి. మట్టిరోడ్డు వెంట పర్యాటకులు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, బల్లలు, తాగునీటి సదుపాయం, మూత్రశాలలతో నిర్మించనున్నారు. కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం, రెండు వాచ్ టవర్లు ఏర్పాటు, సోలార్ బోర్‌వెల్, వాటర్ ట్యాంక్ , రహదారికి రెండువైపులా ఫెన్సింగ్ లాంటివి ఏర్పాటు చేయనున్నారు. మెదక్, కామారెడ్డి జిల్లాలను కలుపుతున్న అంతర్ జిల్లా రహదారిని ఆనుకునే పది కిలోమీటర్ల మేర వైశాల్యంలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీనితో పర్యాటకులకు వన్యప్రాణులతోపాటు జలపాతాలు, అటవీ సొబగులు, గుట్టలు, కుంటలు వీక్షించే అవకాశం కలుగుతుంది.

ఈకో నిధులతో..

వన్యప్రాణి సంరక్షణ విభాగం పరిధిలో ఈకో నిధులతో పర్యాటక ప్రాంతం ఏర్పాటు చేయనున్నారు. దంతేపల్లి అటవీప్రాంతం పరిధిలో ఇందుకోసం ఆశాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. పర్యాటకుల కోసం దంతేపల్లి శివారులోని కాకుల గండి, లొంక ప్రాంతాల్లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా అటవీ అధికారి జోజి, ఇతర అధికారులు అటవీప్రాంతాన్ని సందర్శించారు.

80 ఎకారాలలో..



పర్వతాపూర్ బీట్ పరిధిలో పర్యాటక ప్రాంతం ఏర్పాటు చేయనున్నాం. 80 ఎకారాల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం సుమారు రూ.8 కోట్ల నిధులు అవసరమవుతాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల పర్యాటకులకు ఇదో మంచి అవకాశం. పర్యాటకులు రాత్రివేళ బస చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తాం. – జోజి, జిల్లా అటవీ అధికారి

నేటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పశువులకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,52,524 పశువులు ఉండగా.. అందులో 48,909 ఆవు జాతి గేదెలు, 103615 గేదె జాతి పశువులు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 46 బృందాలుగా ఏర్పడి వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సురేఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 7842651592 నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

పోషక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివకుమారి

తూప్రాన్: సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునాని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివకుమారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోషక ఆహారంపై 9, 10వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, స్పీచ్ కాంపిటీషన్ నిర్వహించారు. పోటీ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కిశోర బాలికలు తీసుకునే ఆహారంలో అన్ని రకాల సమతుల్య ఆహారం తీసుకుంటేనే సరైన పోషణ లభిస్తుందని తెలిపారు. దీనితో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, నిత్యం సుమారు 4లీటర్లకు అధికంగా మంచినీరు తాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పోషణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురా లు ఫ్లోరిన్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, ఉమా పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

మండల పరిధిలోని కామారం తండా వాసులు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో వ్యవసాయ బోరుమోటార్లను ఆశ్రయించాల్సి వస్తుంది. తాగునీరు సరిగా సరఫరా కావడం లేదని, ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలని ఎన్నిసార్లు కోరినా గ్రామపంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని మహిళలు విమర్శించారు. వరి కోతలు మొదలైతే వ్యవసాయ రైతులు కూడా బోరుమోటార్లు బంద్ చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు తాగు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. – చిన్నశంకరంపేట(మెదక్)



బోరుబావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న గిరిజనులు

క్లుప్తంగా

తాను చనిపోతూ ఆరుగురికి అవయవదానం


శ్రీకాంత్‌

అల్లాదుర్గం(మెదక్‌): తాను చనిపోతూ వ్యక్తి ఆరుగురికి అవయవదానం చేశాడు. వివరాలు ఇలా... మండలంలోని చేవెళ్ల నివాసి మదును రోళ్ల శ్రీకాంత్‌ దసరా పండుగను సంతోషంగా తన స్వగ్రామంలో చేసుకున్నాడు. వృత్తి రీత్యా హైదరాబాద్‌కు తిరిగి బయలు దేరాడు. మార్గ మధ్యలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే అతడ్ని హైదరాబాద్‌లోని కొండాపూర్‌ కిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. సోమవారం బ్రెయిన్‌ డెడ్‌ అయినట్లు వైద్యులు నిర్ధారించారు.

జూదరుల అరెస్ట్‌


యూసుఫ్‌పేటలో జూదం ఆడుతున్న వ్యక్తులు

పాపన్నపేట(మెదక్‌): జూదం ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ వివరాల ప్రకారం... మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామ శివారులో జూదం ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో 12 మందిని అరెస్ట్‌ చేశారు. వారి వద్ద నుంచి రూ.14,049 నగదు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గాంధీనగర్‌లో..


పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్‌: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా... మండలంలోని గాంధీనగర్‌ మామిడి తోటలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు, రూ.6,010 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

పెట్రోల్‌ బంక్‌లో చోరీ

నిజాంపేట(మెదక్‌): పెట్రోల్‌ బంక్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పలు సామగ్రిని అపహరించారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని నస్కల్‌ గ్రామంలో భారత్‌ పెట్రోల్‌ బంక్‌ను ఎనిమిది నెలల నుంచి మూసివేశారు. కాగా మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆఫీస్‌ అద్దాలు పగులగొట్టి కంప్యూటర్‌ మానిటర్‌, సీసీ కెమెరా మానిటర్‌ను దొంగిలించారు. బంక్‌ యాజమాని యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెటర్నరీ ఆస్పత్రిలో..

చిన్నశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని వెటర్నరీ ఆస్పత్రిలో చోరీ జరిగింది. వివరాలు ఇలా... ఆస్పత్రిలోని స్టోర్‌ రూమ్‌ తాళం పగులగొట్టి గుర్తుతెలియని దుండగులు సంపు మోటారును ఎత్తుకెళ్లారు. మంగళవారం సిబ్బంది వచ్చి చూడగా స్టోర్‌ రూం తాళం పగులగొట్టి ఉంది. వెటర్నరీ ఆఫీసర్‌ గీతా మాలిక మోటార్‌తో పాటు చిన్న చిన్న వస్తువులు దొంగిలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు


నిందితులను చూపుతున్న పోలీసులు

జోగిపేట(అందోల్‌): టేక్మాల్‌ మండల బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, భార్య వరలక్ష్మిపై దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్‌ఐ పి.పాండు కేసు వివరాలు వెల్లడించారు. వీరప్ప దంపతులు కంది మండలం నుంచి టేక్మాల్‌ గ్రామానికి కారులో వెళుతుండగా అందోలు గ్రామానికి చెందిన ఎండీ. షాహిద్‌, ఎండీ. జాఫర్‌ ద్విచక్ర వాహనంపై అజాగ్రత్తగా మద్యం మత్తులో నడుపుతూ వారి కారును ఢీకొట్టారు. అంతేగాక కారును అడ్డగించి వీరప్పను కొట్టారు. అడ్డుకోబోయిన భార్య వరలక్ష్మిని కూడా గాయపరిచారు. కాగా నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌ పంపించారు.

పాము కాటుతో యువకుడి మృతి

దౌల్తాబాద్‌ (దుబ్బాక): పాము కాటుతో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తిర్మలాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన జానిగామ దయాకర్‌ (22) తమ పంట చేనులో వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పాము కాటు కరిచింది. వెంటనే అతడ్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కష్టే ఫలి!

సొంతూరులో డెయిరీ ఫామ్‌


వెంకటాపూర్‌లో అఖిల డెయిరీ ఫామ్‌

- హర్యానా, గుజరాత్‌ నుంచి 34 గేదెలు
- రోజూ 160 లీటర్ల పాల విక్రయం
- 57 ఏళ్ల వృద్ధుడి సక్సెస్‌పై కథనం

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసే ఈ రోజుల్లో ఓ వృద్ధుడు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. నలభై ఏళ్లుగా ఎన్నో కష్టాలు పడి.. నేడు ఓ డెయిరీ ఫామ్‌కు ఓనర్‌ అయ్యాడు. నాణ్యమైన పాలను అందించడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పిస్తున్న అఖిల డెయిరీ ఫామ్‌ నిర్వాహకుడు కాపు విఠల్‌ సక్సెస్‌పై కథనం.

– రేగోడ్‌(మెదక్‌)

మెదక్‌ జిల్లా రేగోడ్‌ మండలంలోని మక్త వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన 57 ఏళ్ల రైతు కాపు విఠల్‌కు తొమ్మిది ఎకరాల భూమి ఉంది. ముగ్గురు కూతుళ్ల వివాహాలు చేశాడు. 1985లో బయలు


గేదెల నుంచి పాలు తీస్తున్న బిహార్‌ కూలీ

నాటకాలు నేర్పించే విద్యను నేర్చుకుని 40 ఏళ్ల పాటు 47 గ్రామాలు, పట్టణాల్లో సుమారు వెయ్యి మంది కళాకారులతో బయలు నాటకం ప్రదర్శించారు. అల్లుడి సూచన మేరకు గత సంవత్సరం గ్రామంలో అఖిల డెయిరీ ఫామ్‌ ఏర్పాటు చేశాడు. హర్యానా, గుజరాత్‌ నుంచి ఒక్కో గేదెకు సుమారు రూ. లక్ష 80 వేలు వెచ్చించి మొత్తం 34 గేదెలను తీసుకొచ్చాడు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సుమారు 160 లీటర్ల పాలను రేగోడ్‌, నారాయణఖేడ్‌లో విక్రయిస్తూ లాభాలను పొందుతూ నేటి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. నలుగురు బిహార్‌ కూలీలతో పాటు తాను పని చేస్తూ ఫామ్‌ను

కష్టపడితే ఏదైనా సాధ్యం



కృషి పట్టుదలతో పాటు కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు. నలభై ఏళ్ల పాటు బయలు నాటకం నేర్పించా. గత సంవత్సరం మా ఊరులో 34 గేదెలతో డెయిరీ ఫామ్‌ పెట్టిన. రెండు పూటల 160 లీటర్ల పాలు విక్రయిస్తున్నా. పాలల్లో కల్తీ జరిగే ఈ రోజుల్లో.. నాణ్యమైన పాలను విక్రయిస్తూ నలుగురికి ఉపాధి కల్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– కాపు విఠల్‌, డెయిరీ ఫామ్‌ నిర్వాహకుడు

విజయవంతంగా నడుపుతున్నాడు. ఫామ్‌కు సుమారుగా రూ.కోటి ఖర్చు అయిందని విఠల్‌ తెలిపారు. రోజూ పాల విక్రయంతో సుమారు రూ.8,800, నెలకు రూ. 2 లక్షల 64 వేలు సంపాదిస్తున్నాడు. నేటి సమాజానికి ఈ వృద్ధుడు ఆదర్శంగా నిలుస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కదలికలు గమనించి.. కళ్లలో కారం కొట్టి..

- పుస్తెలతాడు చోరీకి యత్నం
- దుండగుడిని పట్టుకున్న కార్‌ వాషింగ్‌ సెంటర్‌ నిర్వాహకుడు


చికిత్స పొందుతున్న బాధితురాలు సునీత

శంకర్‌పల్లి: ఓ దుండగుడు ఇంట్లోకి దూరి కళ్లలో కారం చల్లి.. క్రికెట్‌ బ్యాట్‌తో దాడిచేసి మహిళ పుస్తెలతాడును అపహరణకు యత్నించాడు. పారిపోతున్న దొంగను పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం శంకర్‌పల్లి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన ప్రకారం... కామారెడ్డి జిల్లా జుల్‌కల్‌ మండలం సవర్గాన్‌కు చెందిన కుంబారే సిద్ధారెడ్డి, సునీత దంపతులు వారి కుమారుడు, కుమార్తెతో కలిసి నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం శంకర్‌పల్లికి వచ్చారు. పట్టణంలో టిఫిన్‌ సెంటర్‌ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరిగానే టిఫిన్‌ సెంటర్‌కు వచ్చిన సునీత పిల్లలకు లంచ్‌ బాక్స్‌ కట్టేందుకు 11.30గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఈ దంపతుల కదలికలను గమనిస్తున్న దుండగుడు మంకీ క్యాప్‌ ధరించి హఠాత్తుగా ఇంట్లోకి చొరబడ్డాడు. సునీత కళ్లలో కారం చల్లి.. క్రికెట్‌ బ్యాట్‌తో దాడి చేసి మెడలోని పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. అక్కడే కార్‌ వాషింగ్‌ సెంటర్‌ నిర్వహిస్తున్న ప్రవీణ్‌ గమనించి వెంటనే పట్టుకున్నాడు. అతడి బ్యాగులో కారం పొడి, మంకీ క్యాప్‌, పుస్తెల తాడు లభించింది. అప్పటికే సునీత భర్తకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్ధారెడ్డి దుండగుడు టిఫిన్‌ సెంటర్‌ ఎదురుగా అద్దెకు ఉండే వాసు(45)గా గుర్తించాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన వాసు డైలీ ఫైనాన్స్‌ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు చేవెళ్ల కోర్టులో హాజరు పరిచారు. రిమాండ్‌ నిమిత్తం చర్లపల్లి జైలుకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు


కోర్టులో డబ్బాను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జహీరాబాద్‌ టౌన్‌: రెవెన్యూ, మున్సిపల్‌ అధికారులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలో ఆక్రమణలను తొలగించిన అధికారులు రంజోల్‌లోని అక్రమ కట్టడాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం కోర్టు రోడ్డులో డబ్బాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ రోడ్డులో స్థలాన్ని కబ్జా చేసి డబ్బాలు ఏర్పాటు చేశారు. కాగా పార్కింగ్‌కు స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని న్యాయవాదులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమంగా ఏర్పాటు చేసిన మూడు డబ్బాలను తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పీటీఏల ఏర్పాటుపై వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో పేరెంట్‌, టీచర్‌ అసోసియేషన్‌(పీటీఏ)ల ఏర్పాటుపై వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సర్కార్‌ నుంచి సూచనలు పొంది చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ విద్యా చట్టం–1982లోని సెక్షన్‌ 30 ప్రకారం అన్ని విద్యా సంస్థల్లో పీటీఏను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అనేక చోట్ల ఆ మేరకు చర్యలు చేపట్టలేదంటూ సంగారెడ్డి జిల్లా కంది మండలం అల్లూర్‌ గ్రామానికి చెందిన ఉప్పు మల్లికార్జున్‌ పాటిల్‌ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అపరేశ్‌కుమార్‌, జస్టిస్‌ జీఎం మోహియుద్దీన్‌ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విద్యా వ్యవస్థను సంస్కరించడంలో భాగంగా, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం ఉండేలా, కనీస వసతులు, నిర్వహణపై పర్యవేక్షణ కోసం ప్రభుత్వం పీటీఏలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభమైన 30 రోజులలోపు పాఠశాల హెడ్‌ మాస్టర్‌ పీటీఏను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. చాలా స్కూల్స్‌లో ఇది అమలు కావడం లేదన్నారు. చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో పేరెంట్‌–టీచర్‌ అసోసియేషన్‌ ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం తరపున స్పెషల్‌ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని సమర్పించేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

హవేళిఘణాపూర్‌(మెదక్‌): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని లింగ్సాన్‌పల్లి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన బానోత్‌ సోన(45) కొంత కాలంగా సంసారం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కుటుంబ సభ్యులతో గొడవపడి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకుంది. గమనించిన కుటుంబీకులు కిందకు తీసేలోపే మృతి చెందింది. మృతురాలి భర్త మోహన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

హత్నూర (సంగారెడ్డి): కారు రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని చందాపూర్‌ గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. దౌల్తాబాద్‌ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న కారు అకస్మాత్తుగా రోడ్డు కిందికి దూసుకెళ్లింది. కారు కిందకు పోయి అలాగే ఉండడంతో అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

వ్యాస రచన పోటీలు

మునిపల్లి(అందోల్‌): సమాచార హక్కు చట్టం 2005పై వారోత్సవాల్లో భాగంగా మోడల్‌ స్కూల్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ భీంసింగ్‌ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లి మోడల్‌ స్కూల్‌లో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ఉప తహసీల్దార్‌ ప్రదీప్‌ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ మల్లికతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): శీతాకాలంలో పాడి పశువులకు అనేక వ్యాధులు సంక్రమిస్తాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పశువైద్యుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టాయి. జిల్లాలో నేటి నుంచి పశువైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టనుంది. దీంతో పాటు పాడి పశువులను వ్యాధుల నుంచి ఏ విధంగా కాపాడుకోవాలో పాడి రైతులకు అవగాహన కల్పించనున్నారు. పశువైద్య సిబ్బంది బృందాలుగా విడిపోయి ప్రతి గ్రామంలో 3 నెలలు వయసు దాటిన గేదె, గోజాతి పశువులకు నిరోధక టీకాలు వేయనున్నారు. టీకాలు వేసిన గేదెలకు, గోవులకు గుర్తింపుగా చెవిపోగు వేసి, భారత్‌ పశుధన్‌ యాప్‌లో వివరాలు నమోదు చేయనున్నారు. గాలికుంటు వ్యాధిని నివారించడమే లక్ష్యంగా పశువైద్యులు ముందుకు సాగుతున్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

అనాథగా మిగిలిన మానసిక వికలాంగురాలు


తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న అరుణ

నంగునూరు(సిద్దిపేట): తల్లికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెంబర్ల కొమురవ్వ (85)కు నలుగురు కూతుళ్లు. ముగ్గురి పెళ్లి చేసిన అనంతరం భర్త గురువయ్య మరణించడంతో మానసిక వికలాంగురాలైన చిన్న కూతురు విజయతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న కొమురవ్వ మంగళవారం మృతి చెందింది. కుమారులు లేకపోవడంతో పెద్ద కూతురు అరుణ తల్లికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది. తల్లి మరణంతో వికలాంగురాలైన విజయ అనాథగా మిగిలింది.

క్యూనెట్‌ కేసులో మరో ఇద్దరి అరెస్ట్‌

వివరాలు వెల్లడించిన గౌరారం పోలీసులు

వర్గల్‌(గజ్వేల్‌): క్యూనెట్‌ సంస్థలో పెట్టుబడులు పెట్టి బలవన్మరణం చెందిన యువకుడి కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. మంగళవారం గౌరారం పీఎస్‌లో రూరల్‌ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. వేలూరుకు చెందిన బడుగు హరికృష్ణ(26) అధిక లాభాలు వస్తాయని క్యూనెట్‌ ఆన్‌లైన్‌ సంస్థలో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. తనను క్యూనెట్‌ మోసం చేసిందని సూసైడ్‌ నోట్‌ రాసి ఈ నెల 9న ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వేలూరుకు చెందిన కాల్వల మణికంఠరెడ్డి, అతని బంధువు ఉప్పలపు అలేఖ్యలను సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన కంకణాలపల్లి దివ్య(25), ఖమ్మం టౌన్‌కు చెందిన అనుమోలు భానుప్రకాశ్‌(24)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా హైదరాబాద్‌ సీపీ వీసీ సజ్జనార్‌ 'ఎక్స్‌'లో ఈ ఘటనపై ట్వీట్‌ చేశారు. కేసులో వేగంగా దర్యాప్తు చేపట్టి నలుగురిని అరెస్ట్‌ చేసిన సిద్దిపేట కమిషనరేట్‌ పోలీసులకు అభినందనలు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే దిశగా ముందుకు సాగుతున్న వారి కృషి ప్రశంసనీయమని పోస్టులో పేర్కొన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి..

రూ. 20 లక్షలు చోరీ

సంగారెడ్డి క్రైమ్‌: జిల్లా హెడ్‌ క్వార్టర్స్‌లో పట్టపగలే భారీ దోపిడీ జరిగింది. ఈ ఘటన పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌ వివరాల ప్రకారం... హైదరాబాదులోని టోలిచౌకికి చెందిన మహమ్మద్‌ ముజాఫరుద్దీన్‌ (35) మంగళవారం ఉదయం హైదరాబాద్‌ నుంచి కంది మండల పరిధిలోని సబ్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయానికి తన ఇన్నోవా కారులో వచ్చాడు. సంగారెడ్డి పట్టణంలోని తనకున్న ప్లాటును విక్రయించగా ఆయనకు రూ.20 లక్షలు వచ్చాయి. అనంతరం నగదును తీసుకొని పట్టణంలోని క్లాసిక్‌ గార్డెన్‌లో తన స్నేహితుడిని కలిసేందుకు కారులో వచ్చాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కారును పార్కు చేసి లోపలికి వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి కారులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. వెంటనే బాధితుడు పోలీసులను సంప్రదించగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు సీజ్‌


ద్విచక్ర వాహనాలను సీజ్‌ చేసిన ట్రాఫిక్‌ పోలీసులు

సంగారెడ్డి క్రైమ్‌: నిబంధనలకు విరుద్ధంగా డబుల్‌ సైలెన్సర్లతో ప్రజల ప్రశాంతతకు భంగం కల్గిస్తున్న ద్విచక్ర వాహనదారులపై పట్టణ ట్రాఫిక్‌ పోలీసులు చర్యలు తీసుకున్నారు. తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... వాహనాదారులు రోడ్లపై శబ్దం చేస్తూ వెళ్లడం ద్వారా శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారని తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఐబీ, పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించిన వాహనదారులను 50 మందికి పైగా అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి సాగుపై పోలీసుల కూంబింగ్‌


పంట పొలాల్లో కూంబింగ్‌ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

నారాయణఖేడ్‌: జిల్లా ఎస్పీ పరితోష్‌ పంకజ్‌ ఆదేశాల మేరకు ఖేడ్‌ డివిజన్‌ పరిధిలో మంగళవారం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి అక్రమ గంజాయిసాగు, నిల్వల గురించి కూంబింగ్‌ నిర్వహించారు. ఖేడ్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రావుల శ్రీశైలం ఆధ్వర్యంలో ఠాణాల ఎస్సైలు, సిబ్బంది, క్యూఆర్టీ టీంలు మంగళవారం పలు గ్రామాలు, తండాల శివార్లలోని పంట పొలాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇక నుంచి అన్ని గ్రామాలు, తండాల్లో తనిఖీలు కొనసాగుతాయని డీఎస్పీ తెలిపారు. గంజాయిసాగు, నిల్వతో ఎవరైనా పట్టుబడితే నాన్‌ బెయిలబుల్‌ కేసులు, హిస్టరీషీట్‌ తెరుస్తామని, రైతుభరోసా నిలిపివేత చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి సాగు, నిల్వల గురించి ఎవరికైనా తెలిస్తే డీఎస్పీ నంబర్‌ 87126 56709 కు, ఖేడ్‌ సీఐ 87126 56733 కు, ఖేడ్‌ ఎస్సై 87126 56757 నెంబర్లకు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

సేల్స్‌పై నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌

పటాన్‌చెరు టౌన్‌: బీబీఏ విద్యార్థులకు భవిష్యత్తులో సేల్స్‌పై నైపుణ్యాలను పెంచుకుని.. దానికి అనుగుణంగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ సూచించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ విద్యార్థులకు సేల్స్‌ నిర్వహణ నైపుణ్యాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని టీఎస్‌కేసి, సేల్స్‌ గురుకుల్‌ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ మాట్లాడారు. మార్కెట్‌లో అనేక రకాలైన ఉత్పత్తులు, వాటికి సంబంధించిన మార్కెటింగ్‌పై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలన్నారు. భవిష్యత్తులో రిటైల్‌ మేనేజ్‌మెంట్‌ అమ్మకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రముఖ సేల్స్‌ కోచ్‌ ,'ద సేల్స్‌ గురుకుల్‌ ''వ్యవస్థాపకుడు శ్రీ భరత్‌ సెమినార్‌ను నిర్వహించి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌ కేసీ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ విమల, ఐకేసి కో– ఆర్డినేటర్‌ డాక్టర్‌ కుమారి, సీనియర్‌ అధ్యాపకులు వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ యోగిబాబు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పనికి వెళుతున్నానని చెప్పి..

యువతి అదృశ్యం


మధు కుమారి

పటాన్‌చెరు టౌన్‌: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై హిమబిందు వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాయిరాం నగర్‌ కాలనీకి చెందిన మధు కుమారి (21) హైదరాబాద్‌ మదీనగూడ పరిధిలోని షాపింగ్‌ మాల్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం పనికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్విచ్చాఫ్‌ వచ్చింది.

ఇంటి నుంచి బయటకు వెళ్లి..


ప్రవీణ్‌

చేగుంట(తూప్రాన్‌): బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని పొలంపల్లి గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్‌ జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లోంచి బయటకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. బంధువులు, స్థానికుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నర్సాపూర్‌లో వ్యక్తి..


దుర్గయ్య

నర్సాపూర్‌రూరల్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని రుస్తుంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొన్యాల దుర్గయ్య ఈనెల 12న మధ్యాహ్నం ఇంటి నుంచి పని మీద బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు బంధువులు వద్ద, పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాబోయ్‌ దొంగలు

- ఒంటరి మహిళలే టార్గెట్‌
- పెరుగుతున్న బంగారం ధరలు
- రెచ్చిపోతున్న చైన్‌ స్నాచర్లు



దుబ్బాకరూరల్‌: రోజు రోజుకు బంగారం ధరలు పెరుగుతున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం రూ.లక్షా30వేలకు చేరింది. ఆర్థికంగా ఉన్న కుటుంబాలు ధర ఎంత పెరిగిన అవలీలగా కొనుగోలు చేస్తున్నారు. రోజు రోజుకు బంగారం ధరలు పెరగడంతో చైన్‌ స్నాచర్ల దాడులు అంతకంతకు పెరుగుతున్నాయి.

ఒంటరిగా కనిపిస్తే అంతే..

బంగారం ధరలు ఒక్కసారిగా పెరగడంతో చైన్‌ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. అపహరించడానికి ఎంతకైనా తెగిస్తున్నారు. చైన్‌ స్నాచర్లు ఒంటరి మహిళలనే టార్గెట్‌ చేస్తున్నారు. దారి వెంట వెళ్తున్న వారి మెడలో బంగారం కనిపిస్తే కనిపిస్తే చాలు బలవంతంగా లాక్కెళ్తున్నారు. దీంతో మహిళలు కిందపడి గాయాల పాలవుతున్నారు. కొందరు స్నాచర్లు బైక్‌పై వచ్చి అడ్రస్‌ అడిగినట్లు నమ్మించి పుస్తెలతాడును తెంపుకెళుతున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన మహిళలపై దాడి చేసి బంగారం లాక్కెళ్తున్నారు.

కొన్ని ఘటనలు..

- ఇటీవల అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామంలో పక్కింటి వ్యక్తి ఒంటరిగా ఉన్న మహిళను చూసి ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి బంగారు పుస్తెల తాడును తీసుకుని పరారయ్యాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్నారు.
- మూడు నెలల క్రితం అక్బర్‌పేట – భూంపల్లి చౌరస్తాలో ఓ మహిళ ఒంటరిగా ఉదయం వాకింగ్‌కు వెళ్లగా ఆమెపై దాడి చేసి బంగారం గొలుసును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో ఆమె ఆస్పత్రి పాలైంది.
- సంవత్సరం క్రితం ఇదే గ్రామంలో మహిళ కల్లు దుకాణంలో కల్లు విక్రయిస్తుండగా మాట కలిపి ఆమె మెడలో నుంచి చైన్‌ లాక్కెళ్లారు.
- దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో ఆరు నెలల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో నుంచి నగదు డబ్బులు, బంగారం ఎత్తుకెళ్లారు.